ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 244

పేజీలు : 5 వెల రూ. 2/-

ఆదివారం
21 డిసెంబర్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## ఎల్బీ స్టేడియంలో సీఎం ఎ.రేవంత్ రెడ్డితో కార్పొరేటర్ సిఎన్ రెడ్డి

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న ఎల్ బి స్టేడియంలో క్రైస్తవ సోదరుల కోసం క్రిస్మస్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సీ.ఎన్. రెడ్డి పాల్గొన్నారు.



# పీఎస్సీలకు నిష్పాక్షికతే పునాది

- అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదు
- వికసిత్, ఆత్మనిర్భర్ భారత్ ప్రయాణంలో మీదే కీలకపాత్ర
- ఛైర్‌పర్సన్ల సదస్సులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- పీఎస్సీలు పరిపాలనకు వెన్నెముక: డిప్యూటీ సీఎం భట్టి




2 లో

## విద్వేష ప్రసంగాలను సహించబోం

- పరమత సహనాన్ని పాటించని వారిపై చట్టపరంగా చర్యలు
- బడ్జెట్ సమావేశాల్లో బిల్లు
- ఏసు ప్రభువు స్ఫూర్తితో రాష్ట్ర ప్రజలకు సేవ.. సంక్షేమాలను అందిస్తున్నాం
- క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



2 లో

భారతీయ ప్రాచీన జ్ఞానంతో
## ప్రపంచ సమస్యల పరిష్కారం

- బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవంలో రాష్ట్రపతి ముర్ము



2 లో

# రేవంత్‌రెడ్డిని ప్రజలే.. ఫుట్‌బాల్ ఆడుతరు

- రెండేండ్లలో అన్ని వర్గాలకు మోసం
- బీసీలకు 42శాతం కోటా పేరిట కాంగ్రెస్ దగా
- ఢిల్లీ బీజేపీతో రేవంత్ లోపాయికారి ఒప్పందం
- పాలనా వైఫల్యంతోనే పక్కా రాష్ట్రాలకు కంపెనీలు
- నగరం మూడు ముక్కల ప్రణాళిక అశాస్త్రీయం
- రాజకీయాల్లో రేవంత్, రాహుల్ ఐరన్‌లెగ్‌లు
- రేవంత్ కుటుంబీకులను రాజకీయాల్లోకి లాగం
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేవంత్ దారుణ వైఫల్యం
- వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనేక విజయాలు నా సొంతం
- దమ్ముంటే ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు
- చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2 లో

# పీఎస్సీలకు నిష్పాక్షికతే పునాది

**హైదరాబాద్:**
పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు నిష్పాక్షికతే నైతిక పునాది అని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి.. వినూత్న ఆలోచనలు, నైతికత, ప్రజల పట్ల సానుకూల దృక్పథం కలిగిన సివిల్ సర్వెంట్లు అవసరమన్నారు. సుపరిపాలనలో.. ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థలను నడిపించే వ్యక్తుల నైతికత అత్యంత నిర్ణయాత్మకమన్నారు. దేశసేవ చేసేందుకు నైతిక విలువలు కలిగిన వ్యక్తులను ఎంపిక చేసే బాధ్యత రాజ్యాంగబద్ధ సంస్థలైన పీఎస్సీలపై ఉందని పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో రెండు రోజుల పాటు జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల 26వ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, యూపీఎస్సీ సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా, దినేశ్ దాసా, రాష్ట్రాల పీఎస్సీల స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ అలోక్‌వర్మ, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, ఉత్తర్‌ప్రదేశ్ పీఎస్సీ ఛైర్మన్ సంజయ్ శ్రీనేత్, మరికొన్ని రాష్ట్రాల పీఎస్సీల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. “దేశభవిష్యత్తును నిర్ణయించే వ్యక్తులతో కూడిన సమావేశమే ఈ సదస్సు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిష్పక్షపాతంగా జరగాలి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, రహస్య మూల్యాంకనం వంటి విధానాలతో పక్షపాత ధోరణులను నివారించవచ్చు. నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు సమన్యాయం జరగాలి. యూపీఎస్సీ నియామక విధానంపై ఇప్పటికే విదేశాల్లోని నియామక సంస్థలు ఆరా తీస్తున్నాయి. అంతగా ఆ సంస్థ పరపతి సాధించింది. సుపరిపాలన పునాదులను బలోపేతం చేసేలా వికసిత్, ఆత్మనిర్భర్ దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో పీఎస్సీలు కీలకపాత్ర పోషించాలి. డిజిటల్ గవర్నెన్సు, సామాజిక సమ్మిళితం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వాతావరణ మార్పులపై కార్యాచరణ, ఆర్థిక సంస్కరణల అమలు వంటి కీలక బాధ్యతలు.. కొత్తగా ఎంపికవుతున్న అధికారులపై ఉన్నాయి. ప్రభుత్వ పోటీ పరీక్షల్లో అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదు. వీటి నివారణకు పకడ్బందీ విధానాలను అమలు చేయాలి. అభ్యర్థుల్లో నైతికత, ప్రవర్తన సామర్థ్యాలను అంచనా వేయడానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్మాణాత్మక పద్ధతులు అన్వేషించాలి” అని సూచించారు.

పారదర్శకతే కీలకం: డిప్యూటీ సీఎం భట్టి
పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలన వ్యవస్థకు వెన్నెముక వంటివని, పారదర్శక నియామక విధానాలతో ప్రతిభకు సరైన స్థానం లభిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. “సర్వీస్ కమిషన్లు స్పష్టమైన కాలపరిమితితో వార్షిక క్యాలెండర్లు ప్రకటించి, వాటికి కట్టుబడి ఉండాలి. మరిన్ని సంస్కరణలు అమలు చేయాలి. సమానత్వంతో కూడిన ప్రతిభను ప్రోత్సహించి ప్రజల్లో నమ్మకం పెంచాలి. రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా పనిచేయాలి. సామాజికన్యాయం, సమానావకాశాలు అందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, అవసరమైన చోట ప్రత్యేకంగా అర్హత నిబంధనల సడలింపు, సమాన ప్రాతినిధ్యం లభించేలా పర్యవేక్షణ



వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ముందస్తు జాగ్రత్తలు, నిష్పక్షపాతంగా వ్యవహరించడం ద్వారా న్యాయవివాదాలను తగ్గించవచ్చు. నోటిఫికేషన్ల రూపకల్పనలో న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలి. ఏటా పోటీ పరీక్షలకు లక్షల మంది దరఖాస్తు చేస్తున్నారు. ప్రతి విషయంలోనూ స్పష్టతతో వ్యవహరించాలి. ప్రశ్నపత్రం తయారీ నుంచి మూల్యాంకనం వరకు.. షార్ట్‌లిస్టు నుంచి తుది ఎంపిక వరకు ఎక్కడా అనుమానాలకు తావివ్వకూడదు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని వెల్లడిస్తూ పక్షపాతరహితంగా వ్యవహరించాలి. ప్రశ్నపత్రాల లీకేజీ అంటే.. ప్రజాసేవ విలువలకు, సర్వీస్ కమిషన్ల నైతికతకు ద్రోహం చేయడమే. ఇలాంటివి జరగకుండా కమిషన్లు రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలి. డిజిటల్ ప్లాట్‌ఫాం నుంచి సిబ్బంది వరకు తనిఖీలకు అత్యాధునిక పద్ధతులు ఉపయో గించాలి. ఇంటర్వ్యూ ప్రక్రియను మరింత మెరుగుపరచాలి. సదస్సులో చేసిన తీర్మానాలు అమలు చేయాలి” అని సూచించారు.

# విద్వేష ప్రసంగాలను సహించబోం

**హైదరాబాద్, నారాయణగూడ, :**
పరమత సహనాన్ని పాటించకుండా ఇతర మతాలు, ప్రజల మధ్య విద్వేషం సృష్టించే ప్రసంగాలు చేసేవారిని చట్టపరంగా కఠినంగా శిక్షించేందుకు వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో ఒకేరోజు క్రిస్మస్ పండగను జరుపుకొంటారని, మానవుడే దేవుడిగా మారిన ఏసు ప్రభువు జన్మదినం ప్రపంచానికే గొప్ప పండగని అభివర్ణించారు. “రాష్ట్రంలో ప్రజలు ఎవరైనా సరే వారికి నచ్చిన మతాన్ని, సంప్రదాయాలను ఆచరించవచ్చు. అదే సమయంలో ఇతర మతాలను రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాలు, వేదికల్లో ప్రసంగాలు చేస్తే సహించబోం. విద్వేష ప్రసంగాల నిరోధంపై కర్ణాటక శాసనసభలో రెండ్రోజుల క్రితమే బిల్లును ప్రవేశపెట్టారు. ఇదే తరహాలో తెలంగాణలోనూ కఠినంగా వ్యవహరిస్తాం.

డిసెంబరు అద్భుత నెల.. విశ్వవ్యాప్తంగా డిసెంబరు అంటే అద్భుతమైన మాసం. ఏసు ప్రభువు జన్మించి దైవదూతగా అవతరించారు.. ఇంకా కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు ఈ నెల మిరాకిల్ మంత్...కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఈ నెలలోనే జన్మించారు. తెలంగాణ బిడ్డల ఆత్మ బలిదానాలను చూసి చలించిపోయిన ఆమె డిసెంబరులోనే తెలంగాణ ఏర్పాటుపై ప్రకటన చేశారు. రెండేళ్లక్రితం ఎల్బీ స్టేడియంలో ప్రజాపాలనకు శ్రీకారం చుట్టాం. నాలుగు కోట్ల మంది ప్రజలకు శాంతితో పాటు సంక్షేమాన్ని అందిస్తున్నాం. మా పాలనలో ఏసు ప్రభువు బోధనలను అనుసరిస్తున్నాం. బాధాతప్తులకు చేరువవుతున్నాం. మెరుగైన ఆరోగ్య భద్రత కోసం 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం. వీటిని చంటి పిల్లలకు సంతోషంగా తినిపిస్తున్నారు.

క్రిస్టియన్ మిషనరీ విద్యాసంస్థలు ఆదర్శం.. విద్య, వైద్యం ప్రాధాన్యాలుగా పంచవర్ష ప్రణాళికలను దేశ తొలి ప్రధాని నెహ్రూ అమలు చేశారు. అప్పట్లో దేశ ప్రజల జీవన ప్రమాణం 32 సంవత్సరాలే. జనాభా పెరుగుతున్న కొద్దీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని ప్రజలందరికీ అందించలేని పరిస్థితుల్లో క్రిస్టియన్ మిషనరీ విద్యాసంస్థలు ఒక యుద్ధంలా మారుమూల ప్రాంతాల్లో విద్యాసంస్థలు స్థాపించి, ఆసుపత్రులు నిర్మించి శాస్త్రవేత్తలు, ఇంజినీర్లను జాతికి అందించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు క్రిస్టియన్ మిషనరీ విద్యాసంస్థలు, ఆసుపత్రుల కారణంగా ఇప్పుడు మన దేశ ప్రజల సగటు ఆయుర్దాయం 72 సంవత్సరాలకు పెరిగింది. జనాభాలో తక్కువగా ఉన్న క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు వారిపై దయతో కాదు... వారికి ఇస్తున్న హక్కులు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో క్రిస్టియన్లు, ముస్లింలు శ్మశాన వాటికలు కోరుతున్నారు.

గ్రామాలకు దూరంలో ఉన్న స్థలాలను కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఏసు ప్రభువు జన్మదినం శాంతితో పాటు ప్రేమను పంచాలి. క్రిస్మస్, నూతన సంవత్సరం గొప్ప మార్పును తీసుకురావాలి. తెలంగాణ రైజింగ్‌తో దేశంలోనే మనం ప్రథమ స్థానంలో ఉండాలని ప్రభువును ప్రార్థించాలి’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మైనార్టీ సంక్షేమ కార్యదర్శి షఫివుల్లా, మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ దీపక్‌జాన్, మాజీ డీజీపీ స్వరణ్‌జిత్ సేన్, గుజరాత్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బిషప్‌లు, క్రైస్తవ మతపెద్దలు పాల్గొన్నారు. వివిధ ఆశ్రమాల నుంచి వచ్చిన అనాథలకు సీఎం క్రిస్మస్ బహుమతులు అందజేశారు.

# షాహీ ఎక్స్పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికుల చర్చలు సఫలం

**– మహిళా కార్మికులు, ట్రేడ్ యూనియన్ సంఘాలు సంయుక్తంగా బాణాసంచా కాల్చి సంబురాలు**
**– కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపిన మహిళా కార్మికులు**

ఏ ఎం న్యూస్ ఓయూ :




నాచారం పారిశ్రామికవాడలోని షాహీ ఎక్స్పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికులు గత 12 రోజులుగా నిరవధిక పోరాటం విజయవంతం అయింది.మూడు రోజులుగా జాయింట్ లేబర్ కమిషనర్ శ్యామ్ సుందర్ రెడ్డితో మహిళా కార్మికులు, ట్రేడ్ యూనియన్ సంఘాలు మరియు కంపెనీ జీఎం మురళితో సంయుక్తంగా నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి, కార్మికులు పెట్టిన డిమాండ్లను కంపెనీ యాజమాన్యం లిఖితపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కంపెనీ వద్ద టపాసులు కాల్చి సంబురాలు చేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వివిఎస్. బోస్ మాట్లాడుతూ మహిళా కార్మికుల పోరాటం అద్వితీయమని,మొక్కవోని పోరాట పటిమ కనబర్చి కంపెనీ యాజమాన్యం ను ఒప్పించడంలో కీలకభూమిక పోషించారని అన్నారు. యాజమాన్యం ప్రధానంగా జీతభత్యాల పెంపు అంశంలో ఏప్రిల్ మాసం లోపు హై లెవల్ కమిటీ ద్వారా కార్మిక చట్టం ప్రకారం ఇంక్రిమెంట్లు,ఆయా విభాగాల వారీగా జీతాల పెంపుదల చేస్తామని అన్నారు. అలాగే కార్మికులపై వేధింపులు ఇకపై ఉండవని, కంపెనీలో క్యాంటీన్, మరుగుదొడ్ల సంఖ్యను పెంచుతామని, జీతాల చెల్లింపులో అనవసర తొలగింపులు ఉండవని, ఒకరోజు సెలవు పెడితే రూ.800/- లు కటింగ్ చేసే పద్ధతికి స్వస్తి పలుకుతామని, సమ్మె కాలపు వేతనం ఇస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఐఎన్టీయూసీ నేతలు రామకృష్ణ రెడ్డి, హబీబ్, ఏఐటీయూసీ నేతలు గిరిబాబు, అజీమ్, శేఖర్, స్వప్న, మహిళా కార్మికులు రజిత, పద్మ, షాలిని, పూజ, రంకు పాల్గొన్నారు.






# భారతీయ ప్రాచీన జ్ఞానంతో ప్రపంచ సమస్యల పరిష్కారం

**హైదరాబాద్ గచ్చిబౌలి :**
సామాజిక ఐక్యతకు, జాతీయ ప్రగతికి ఆధ్యాత్మికత ఒక బలమైన పునాదిగా పనిచేస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రేరణ కలిగిన ప్రజలు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తారని, దేశ నిర్మాణానికి చురుగ్గా సహకరిస్తారని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గచ్చిబౌలిలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహించిన ‘భారత కాలాతీత జ్ఞానం: శాంతి, పురోగతికి మార్గం’ సదస్సులో రాష్ట్రపతి ప్రసంగించారు. భారతీయ ప్రాచీన జ్ఞానం, ఆధ్యాత్మిక వారసత్వం ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న మానసిక, నైతిక, పర్యావరణ సమస్యలకు పరిష్కారం చూపుతుందని ఆమె అన్నారు. వేల ఏళ్లుగా భారతీయ నాగరికత సత్యం, న్యాయం, కరుణ, ప్రకృతితో మమేకమై జీవించడం వంటి సూత్రాలపై ఆధారపడి ఉందని గుర్తుచేశారు. వసుధైక కుటుంబం భావన నేటి ప్రపంచ శాంతికి అత్యంత అవసరమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా భారతీయ ప్రాచీన జ్ఞానానికి ప్రపంచ గుర్తింపు లభించిందని... తద్వారా ప్రపంచ శాంతికి, మానవ కల్యాణానికి అగ్రదూతగా భారత్ నిలిచిందని ఆమె తెలిపారు. భౌతిక అభివృద్ధితో మాత్రమే జీవితంలో సుఖశాంతులు లభించవని... అంతర్గత స్థిరత్వం, భావోద్వేగాల నియంత్రణ, విలువలతో కూడిన ఆలోచన చాలా అవసరమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధిని కాంక్షించే సమతుల అభివృద్ధి ఉపనిషత్తుల సారాంశానికి అనుగుణంగా ఉందని రాష్ట్రపతి చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం మనకు స్వావలంబన నేర్పుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధనం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రకృతితో సహజీవనం చేయాలనే భారతీయ ఆలోచన విధానం నుంచి ఉద్భవించాయని వివరించారు. భారతీయ విలువలను వివిధ దేశాలకు వ్యాపింపజేస్తున్నాయంటూ బ్రహ్మకుమారీస్ సంస్థను రాష్ట్రపతి అభినందించారు. 21 ఏళ్లుగా విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం, శాంతి, సానుకూలతలు పెంపొందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

మానవాళికి విలువలు నేర్పుతున్నాం: గవర్నర్
శాంతి, కరుణ, ఆత్మనియంత్రణ, సామరస్యం, శాంతియుత సహజీవన విలువలను మన దేశం యుగాలుగా మానవాళికి అందించిందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. వేగవంతమైన శాస్త్రీయ పురోగతితో పాటు ఒత్తిడి, సంఘర్షణలు, పర్యావరణ సమస్యలు, నైతిక అయోమయాన్ని మానవాళి నేడు ఎదుర్కొంటోందన్నారు. కార్యక్రమంలో మంత్రి సీతక్క, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, బ్రహ్మకుమారీస్ సంయుక్త ప్రధాన నిర్వాహకుడు రాజయోగి బి.కె.సంతోష్ దీక్షిత్, అదనపు ప్రధాన కార్యదర్శి రాజయోగి బి.కె.మృదుంజయ, హైదరాబాద్ డైరెక్టర్ రాజయోగిని బి.కె.కుల్దీప్ తదితరులు పాల్గొన్నారు.

సేవా ప్రాజెక్టుల ప్రారంభం.. తెలంగాణలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చేపట్టే పలు సేవా ప్రాజెక్టులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించారు. వృద్ధుల కోసం సంజీవని, పాఠశాల ఉపాధ్యాయుల కోసం విలువల ఆధారిత శిక్షణ కార్యక్రమాలు, డిజిటల్ వ్యసనాన్ని తగ్గించేందుకు యువత, కార్పొరేట్ రంగం కోసం డిజిటల్ వెల్‌నెస్ కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకుముందు శాంతి సరోవర్ ప్రాంగణంలో రాష్ట్రపతి మొక్కలు నాటారు.

# కార్మిక చట్టాలను తుంగలో తొక్కడం దారుణం

**కొత్త చట్టాలతో కార్మికుల హక్కులకు భంగం**
**కేంద్రం తీరుపై మండిపడ్డ లెఫ్ట్ నేతలు**

**విజయవాడ,డిసెంబర్19:**
కార్మిక చట్టాల రద్దు గురించి పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుపట్టినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని లెఫ్ట్ నేతలు మండిపడ్డారు. ఈ కోడ్‌ల ప్రకారం దేశంలోని 70 శాతం పరిశ్రమల్లోని 74 శాతం కార్మికులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకుండా పోతున్నాయి. ప్రజా సంక్షేమ చట్టాలను రద్దు చేస్తూ కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను నివారించగలిగే స్థితి రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలకు వుంది. ఈ పార్టీలు మద్దతు ఇవ్వకపోతే కేంద్ర ప్రభుత్వం మనుగడ కోల్పోతుంది. మన రాష్ట్రంలోని గ్రామీణ కూలీలకు, మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు తోడ్పడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కుదించి రాష్ట్రంపై భారం వేస్తున్న బిల్లును బలపరచి ఆర్థిక భారం రాష్ట్రంపై వేయవద్దని టిడిపి ఎంపీ కోరడం విడ్డూరంగా వుంది. చట్టబద్ధంగా రాష్ట్రానికి రావలసిన నిధులే ఇవ్వని కేంద్రం ఈ విజ్ఞప్తులకు, విన్నపాలకు స్పందిస్తుందా అని అన్నారు. స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి ఏలుబడిలో బ్రిటిష్ కాలం నాటి 12 గంటల పని విధానాన్ని అమలులోకి తెచ్చింది. కార్మికుల జన్మహక్కుగా వున్న సమ్మె హక్కు ప్రమాదంలో పడింది. గతంలో జర్మనీ, ఇటలీ దేశాల్లో ఫాసిస్టు పాలకులు చేసిన మొదటి పని కార్మిక సంఘాలను నిషేధించడం, వారి చట్టబద్ధ హక్కులను కాలరాయడం. నేడు దేశంలో అదే తరహా విధానాలు అమలవుతున్నాయని సిపిఎం నేతలు మధు, గఫూర్‌లో వేర్వేరుగా అభిప్రాయపడ్డారు. 2005లో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ వ్యవసాయ కూలీలకు పనిని హక్కుగా ఇచ్చింది. ఆ హక్కును తొలగించి, రాష్ట్రాలపై నిధుల భారం వేస్తూ వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (విబి-జి ఆర్‌ఎఎమ్ జి) బిల్లును ఆమోదించుకున్నారు. వారి మతతత్వ ఎజెండాకు అనుగుణంగానే పాత చట్టంలోని మహాత్మా గాంధీ పేరును తొలగించి 'రామ్' వచ్చేలా పేరు పెట్టారని మండిపడ్డారు. గత ఐదు సంవత్సరాలుగా ఉపాధి చట్టానికి కేంద్రం నిధులు తగ్గిస్తూ వచ్చింది. ఈ చట్టంలో అవినీతి జరుగుతుందని, వ్యవసాయ సమస్యలకు కారణమని, ఉచిత పథకాలు ఎంత కాలమని బిజెపి నేతలు, వారి అనుంగ మీడియా చాలా కాలంగా చేస్తున్న ప్రచారానికి తగ్గట్టుగానే కొత్త బిల్లును తెచ్చారని మండిపడ్డారు. 12.16 కోట్ల మంది గ్రామీణ పేదలకు ఇచ్చే ఈ అతికొద్ది మొత్తమే అవినీతి, అక్రమం అయితే మోడీ 11 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ కంపెనీలకు రూ.17.2 లక్షల కోట్ల రుణాలను రద్దు చేయడాన్ని ఏమనాలని నిలదీశారు.

# రేవంత్‌రెడ్డిని ప్రజలే.. ఫుట్‌బాల్ ఆడుతరు

హైదరాబాద్, డిసెంబర్ 20 :
‘సీఎం రేవంత్‌రెడ్డి ఎవరితోనైనా ఫుట్‌బాల్ ఆడుకోవచ్చు.. కానీ రెండేండ్లలో అన్ని వర్గాలను మోసం చేసిన ఆయనను ప్రజలే ఫుట్‌బాల్ ఆడుడు ఖాయం’ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తేల్చిచెప్పారు. పాలనా వైఫల్యాలతోనే దిగ్గజ కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఆరోపించారు. రెండేండ్లలో పథకాల పేర్లు మార్చడం తప్ప సాధించిందేమీ లేదని దెప్పిపొడిచారు. రేవంత్‌రెడ్డి తరహాలో కుటుంబసభ్యులను రాజకీయాల్లోకి లాగడం తమ సంస్కృతి కాదని, అది కేసీఆర్ పద్ధతి కాదని కుండబద్దలు కొట్టారు. బీసీలకు 42శాతం కోటా పేరిట డ్రామాలు చేసిన కాంగ్రెస్ చివరకు పంచాయతీ ఎన్నికల్లో 17శాతమే ఇచ్చి చేతులెత్తేసిందని నిప్పులు చెరిగారు. పంచాయతీ ఎన్నికల్లో 66 శాతం స్థానాలు గెలిచామని విర్రవీగుతున్న రేవంత్‌రెడ్డి దమ్ముంటే ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీ నామా చేయించాలని సవాల్ విసిరారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న సందర్భంలో బీఆర్ఎస్ అనేక విజయాలు సాధించిందని, కానీ రేవంత్‌రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు కాంగ్రెస్ అనేకసార్లు ఓటమిని మూటగట్టుకున్నదని గుర్తుచేశారు. బీజేపీ ఢిల్లీ పెద్దలతో లోపాయికారి ఒప్పందాన్ని కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి బీఆర్ఎస్‌పై బురదజల్లడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. తెలంగాణ ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంలా మారిందని ఆరోపించారు. నగరాన్ని మూడు ముక్కలు చేయాలనే రేవంత్ ఆలోచన అశాస్త్రీయమని తేల్చిచెప్పారు. శనివారం తెలంగాణ భవన్‌లో సుదీర్ఘంగా నిర్వహించిన మీడియాతో చిట్‌చాట్‌లో అనేక ప్రశ్నలకు సవివరంగా సమాధానాలు ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డిపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు.

రాజకీయాల్లో సంస్కారం ముఖ్యం.. రాజకీయాల్లో సంస్కారం, విలువలు ముఖ్యమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంట్లోని మహిళలు, పిల్లలు, ఆయన మనుమడి గురించి మాట్లాడనని, వారి కుటుంబసభ్యుల విషయంలో చిల్లర రాజకీయాలు చేయనని స్పష్టం చేశారు. రాజకీయ పోరాటం కేవలం నేతల మధ్యే ఉండాలని, గతంలో అస్సాం సీఎం రాహుల్ పుట్టుకను ప్రశ్నించిన సందర్భంలో కేసీఆర్ నిర్ద్వంద్వంగా ఖండించారని గుర్తుచేశారు. విలువలతో కూడిన రాజకీయమే తమ సంస్కృతి అని ఉద్ఘాటించారు.

రేవంత్‌రెడ్డి మొన్న మీడియాతో మాట్లాడిన సమయంలో మనుమడితో ఫుట్‌బాల్ ఆడిన అంశంపై స్పందించాలని కోరగా, తాను ఆయన మనువడి గురించి మాట్లాడనని, కేసీఆర్ అలాంటి పద్ధతి నేర్పించలేదని తేల్చిచెప్పారు. రేవంత్ తరహాలో కుటుంబీకులను రాజకీయాల్లోకి లాగడం, ప్రత్యర్థుల చావును కోరుకొనే నీచమైన మనస్తత్వం తనదికాదన్నారు. రేవంత్, ఆయన మనువడు, కుటుంబీకులు నిండూ నూరేండ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థిస్తానని పేర్కొన్నారు. కానీ రాజకీయంగా రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

బీసీ కోటాపై కాంగ్రెస్ ద్రోహం.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ దారుణంగా వంచించిందని కేటీఆర్ విరుచుకుపడ్డారు. గతంలో 23శాతం ఉన్న రిజర్వేషన్లను 17శాతానికి తగ్గించిందని మండిపడ్డారు. పార్టీపరమైన రిజర్వేషన్లకు సీఎంకు సంబంధం లేదని, ఆయన కాంగ్రెస్ సహా ఇతర పార్టీలకు అధ్యక్షుడు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. బీసీలకు సీట్లు ఇచ్చే అంశంపై తాము రేవంత్ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని, అనేక సందర్భాల్లో మెరుగైన ప్రాతినిధ్యం కల్పించామని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో జనరల్ కోటాలో 6 సీట్లు(50శాతం) ఇచ్చామని, కాంగ్రెస్ ఎన్ని సీట్లు ఇచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 34శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తే, కాంగ్రెస్ 19 సీట్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నదని ఆయన ధ్వజమెత్తారు.

బీసీలకు 42శాతం కోటాపై ఆయనకు చిత్తశుద్ధి లేదని ఆక్షేపించారు. నిజంగానే బలహీనవర్గాలపై ప్రేమ ఉంటే ఆయన చేయదగిన విద్య, ఉద్యోగాలు, కాంట్రాక్టుల్లో కోటా ఎందుకివ్వడం లేదని కేటీఆర్ నిలదీశారు. ముదిరాజ్‌లను బీసీ-‘ఏ’లో చేర్చుతామని, ఏటా రూ.20వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీలు గుప్పించి నట్టేట ముంచారని ఆయన మండిపడ్డారు. వైన్స్‌ల కేటాయింపులో గౌడన్నలకు, మార్కెట్ కమిటీల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కిందని గుర్తుచేశారు. 42శాతం కోటాను తెరపైకి తెచ్చి బీసీలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకటే అంటూ రేవంత్ చేసిన కామెంట్స్‌పై కేటీఆర్ రియాక్టయ్యారు. ‘రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ మధ్య అద్భుతమైన మైత్రి బంధం ఉన్నది.. అదీ ముఖ్యమంత్రికి, బీజేపీ నేతలకు తెలుసు.. అందుకే ప్రధాని మోదీ రాష్ట్ర బీజేపీ నేతలకు తలంటినట్లు వచ్చిన వార్తలను ప్రస్తావించారు. రేవంత్ ఇంటిని రీమోడల్ చేయించింది బీజేపీ ఎంపీ కాదా?

కాంగ్రెస్, బీజేపీలు చీకటి ఒప్పందం కుదుర్చుకొని ప్రజలను ఏమార్చుతున్నాయని కేటీఆర్ నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ బీజేపీ పెద్దలతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. ‘చీకట్లో చేతులు కలుపకుంటే ఢిల్లీలో బీజేపీ ఎంపీ దూబే గృహ ప్రవేశానికి రేవంత్ ఎందుకు వెళ్లారో రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచంద్రరావు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని రేవంత్ ఇంటిని రీ మోడలింగ్ చేయించింది ఓ బీజేపీ ఎంపీయేనంటూ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రేవంత్‌రెడ్డి కాంట్రాక్టులు ఇస్తున్నందుకే ఆ పార్టీ పెద్దలు రాష్ట్ర కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని సాక్షాత్తు ప్రధాని, కేంద్ర హోం మంత్రి ఆరోపణలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ మరీ కేంద్రంలోని బీజేపీ చర్యలెందుకు తీసుకోలేదని నిలదీశారు. పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ జరిగిన తర్వాత కేసు నమోదు చేయకుండా ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు. తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందన్నారు. అఖిలేశ్ యాదవ్ తనకు మొదటినుంచీ మంచి మిత్రుడని, ఆయనను కలిస్తే బీజేపీ నేతలకు ఎందుకంత బాధ అని ప్రశ్నించారు. రాష్ట్రానికి రూపాయి కూడా తేవడం చేతగాని కిషన్‌రెడ్డితో తమకేం ప్రయోజనం ఉంటుందని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. పాలనా వైఫల్యం.. పారిశ్రామికాభివృద్ధికి విఘాతం.. రేవంత్ సర్కారు పాలనా వైఫల్యంతో పారిశ్రామికాభివృద్ధికి విఘాతం కలుగుతున్నదని, రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ‘పారిశ్రామిక వేత్తలు ఏపీకి తరలిపోతున్నారు.. విరూపాక్ష ఫార్మా లాంటి కంపెనీలు కర్నూలుకు వెళ్లిపోవడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. లగచర్లలో ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. గ్రీన్ ట్రిబ్యునల్ మొట్టికాయలు వేసినా కాంగ్రెస్ నేతలకు బుద్ధిరాలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫార్మాసిటీ రద్దు, ఫార్మా విలేజీల ఏర్పాటు, అడ్డదిడ్డమైన విధానాలతో ఈ దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. ‘ఉపాధి’లో సంస్కరణలతో పేదలకు అన్యాయం ఉపాధి హామీ పథకంలో సంస్కరణల పేరిట గ్రామీణ పేదలకు తీరని అన్యాయం చేస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం మహాత్ముడి పేరు మార్చడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. అసలు ఆ ఆలోచన బీజేపీకి ఎందుకు వచ్చిందని ప్రశ్నించినా ఆయన, అడ్డగోలు నిబంధనలతో ఉపాధి పథకం ఉసురు తీసేందుకు కంకణం కట్టుకున్నదని ఆరోపించారు. ఈ స్కీమ్ పేరు మార్పుపై పార్లమెంట్ సాక్షిగా అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ.. తమ పార్టీ పాలిత రాష్ట్రమైన తెలంగాణలో అడ్డగోలుగా పథకాల పేర్లు మార్చుతుంటే ఎందుకు మౌనం వహించారని నిలదీశారు. కాంగ్రెస్ సర్కారు పేర్లు మార్చడమే కాదు.. ఏకంగా తెలంగాణ తల్లినే మార్చిందంటూ నిప్పులు చెరిగారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా బల్దియాల విలీనం మున్సిపల్ ఎన్నికలు, హైదరాబాద్ అభివృద్ధి, జీహెచ్ఎంసీలో వార్డుల విభజన, మున్సిపాలిటీల విలీన ప్రక్రియ సక్రమంగా జరుగలేదని కేటీఆర్ ఆక్షేపించారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా బల్దియాలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. గ్రేటర్‌ను మూడు కార్పొరేషన్లు చేసేందుకు రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. వార్డుల విభజన అశాస్త్రీయంగా చేశారని చెప్పారు. ఒక వార్డులో అత్యంత తక్కువ జనాభా, మరొక వార్డులో పెద్దమొత్తంలో ఓటర్లు ఉన్నారని చెప్పారు. ‘సీఎం రేవంత్‌రెడ్డి.. జీహెచ్ఎంసీని విస్తరించి 300 వార్డులుగా చేసినప్పటికీ అసలు ఎన్ని కార్పొరేషన్లు చేస్తారు? వార్డుల పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వ ఆలోచన ఏమిటి? అనే విషయాలు ప్రజలకు, పార్టీలకు చెప్పకపోవడం అభ్యంతరకరమన్నారు. అసెంబ్లీలోనూ ఈ అంశంపై స్పష్టతనివ్వకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. అయితే హైదరాబాద్‌ను మూడు ముక్కలుగా చేస్తానని తన మిత్రులతో రేవంత్ చెప్పుకొంటున్నట్టు వస్తున్న వార్తలను ప్రస్తావించారు. అయితే విభజన అంశం ప్రజాప్రతినిధుల కంటే ముందే ఆయన మిత్రులకు తెలుస్తున్నదని, స్వయంగా హైదరాబాద్ మేయర్ కూడా తనకు సమాచారం లేదని కౌన్సిల్ మీటింగ్‌లో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. వార్డుల విభజనపై బీఆర్ఎస్ సభ్యులు కౌన్సిల్‌లో స్పష్టంగా తెలియజేశారని చెప్పారు. చిన్న మున్సిపాలిటీలను పెద్దవాటిలో కలిపితే అనేక సమస్యలు వస్తాయనే విషయాన్ని లేవనెత్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ రెండో రాజధాని అంశపై స్పందిస్తూ అనేక ఏండ్లు ఉద్యమించి హైదరాబాద్ రాజధానిగా తెలంగాణను సాధించుకున్న తర్వాత రెండో రాజధానిగా చేసే సాహసం బీజేపీ, కాంగ్రెస్ చేయకపోవచ్చని అభిప్రాయపడ్డారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేవంత్‌రెడ్డి ఫెయిల్.. వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలపై రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలకు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ‘నేను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక స్థానిక ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించాను. 90శాతం మున్సిపాల్టీలపై గులాబీ జెండాను ఎగురేశాం. జీహెచ్ఎంసీని రెండోసారి కైవసం చేసుకున్నాం. రాష్ట్రంలోని అన్ని జడ్పీలను గెలుచుకున్నాం..’అని గుర్తుచేశారు. కానీ రేవంత్‌రెడ్డి తన సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించుకోలేకపోయారు.. పీసీసీ అధ్యక్షుడిగా ఉండి దాదాపు అన్ని ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ దారుణ ఓటమిని మూటగట్టుకున్నది.. ఏకంగా డిపాజిట్లు కోల్పోయింది’ అని ఎద్దేవా చేశారు. ఇక ఓటముల విషయానికి వస్తే రాహుల్ ఎన్నిచోట్ల విజయాలు సాధించారో రేవంత్‌రెడ్డి చెబితే బాగుంటుందని చురకలంటించారు. రాహుల్, రేవంత్ ముమ్మాటికీ ఐరన్‌లెగ్‌లేనని దెప్పిపొడిచారు. తాను వ్యక్తిగతంగా విజయం సాధించానని గొప్పలు చెప్పుకోవడం లేదని, పార్టీ సమిష్టి కృషితోనే అప్రతిహతంగా దూసుకెళ్లామని ఉద్ఘాటించారు.

# షాహి కార్మికులకు సీఐటీయూ జేజేలు..

- 12 రోజుల సమ్మెకు ఫలితం
- 8 ప్రధాన డిమాండ్లకు యాజమాన్యం అంగీకారం



ఏ ఎం న్యూస్ ఓయూ: నాచారం పారిశ్రామిక ప్రాంతంలోని షాహి గార్మెంట్స్ ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికులు జీతాల పెంపు, వేధింపుల నివారణ, బోనస్‌తో పాటు హక్కుల పరిరక్షణ కోరుతూ గత 12 రోజులుగా చేపట్టిన సమ్మెకు సీఐటీయూ జిల్లా నాయకత్వం సంపూర్ణ మద్దతు తెలిపి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కీలక పాత్ర పోషించింది. సమ్మె నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు షాహి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. సీఐటీయూ నాయకత్వం జోక్యంతో యాజమాన్యాన్ని జాయింట్ లేబర్ కమిషనర్ (జెఎల్‌సీ) వద్ద చర్చలకు రావడానికి ఒప్పించడం జరిగింది. మొదటి రోజు చర్చలు విఫలమవడంతో, ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు. అనంతరం స్థానిక జెఎల్‌సీతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపి, 19న జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు సాగిన దీర్ఘ చర్చల్లో కార్మికులు చేసిన 12 డిమాండ్లలో 8 డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించింది. యాజమాన్యం అంగీకరించిన ప్రధాన డిమాండ్లు.. ప్రతి కార్మికుడికి వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వడం రిటైర్మెంట్ బోనస్‌గా ఒక్కొక్కరికి రూ.900 చెల్లింపు, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పింపు, వర్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి కార్మికులకు ప్రాతినిధ్యం, 20 శాతం బోనస్ చెల్లింపు, కార్మికులపై వేధింపులు జరగకుండా చర్యలు, రోజుకు రూ.800 వరకు జరుగుతున్న కట్‌ను నిలిపివేయడం, 'నో వర్క్ – నో పే' అంశంపై పునర్విచారణ, ఈ అన్ని అంశాలను రాతపూర్వక ఒప్పందంగా జెఎల్‌సీ నేతృత్వంలో యాజమాన్యం, కార్మికుల సమక్షంలో కుదుర్చుకున్నారు. హై లెవల్ కమిటీ 15 రోజుల్లో కంపెనీని సందర్శించి మిగిలిన సమస్యలను పరిష్కరిస్తుందని యాజమాన్యం హామీ ఇచ్చింది. పెరిగిన వేతనాలు, ఇతర అంశాలు ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని మెజారిటీ కార్మికులు ఆమోదించడంతో పాటు, మిగిలిన కార్మికులకు వివరించడంతో అందరూ తిరిగి విధుల్లో చేరారు. కార్మికులు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్చల సారాంశాన్ని కార్మికులకు వివరించేందుకు పి.గణేష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో సీఐటీయూ నాయకులు కోమటి రవి, ఎస్.రమా, రమేష్, శ్రీకాంత్, అశోక్, జి.శ్రీనివాసులు, వెంకన్న, టీయూసీఐ నాయకులు ప్రదీప్ రమేష్, సీపీఐ సత్యప్రసాద్, పీవోడబ్ల్యూ ఝాన్సీ, షాహి కార్మిక నాయకులు శాలిని, శ్యామల, వనిత, పూజ, దేవి, రింకు సింగ్ తదితరులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పోరాటంలో పాల్గొన్న అన్ని కార్మిక సంఘాల నాయకులు, స్థానికులు, విలేకరులు, మీడియా మిత్రులు, పోలీసులు, సీపీఎం, సీపీఐ, సీపీఐ మాస్ లైన్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు సీఐటీయూ తరఫున విప్లవాత్మక అభినందనలు తెలియజేస్తున్నామని నాయకులు తెలిపారు.

# సైబర్ సురక్షిత నగరంగా తీర్చిదిద్దాలి: డీసీపీ బాలస్వామి

## తార్నాకలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం




ఏ ఎం న్యూస్ ఓయూ: తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో ఈస్ట్ జోన్ సైబర్ సెల్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి హాజరై మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏపీకే ఫైల్స్, డిజిటల్ అరెస్ట్ మోసాలు, వాట్సాప్ హ్యాకింగ్ వంటి ఘటనలు పెరుగుతున్నాయని, వాటి నుంచి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ సురక్షిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖతో పాటు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ సంవత్సరంలో దేశంలో ఇలాంటి నేరాలకు పడుతున్న వివిధ రాష్ట్రాలలో ఉన్న 325 మంది నేరస్తులను పట్టుకున్నామని, ఇతర దేశాలలో ఉంటూ నేరాలకు పాల్పడుతున్న వారిని పట్టుకునేం దుకు అక్కడి చట్టాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సైబర్ సెల్ ఎస్సై మేఘన మాట్లాడుతూ గతంలో జరిగిన సైబర్ నేరాల ఉదాహరణలను వివరించి, మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రావు, జనరల్ సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి, శ్రీలత, ఖలీల్, నారాయణరెడ్డి, నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జలంధర్ రెడ్డి, డాక్టర్ టీవీ రావు, హరికుమారి, డాక్టర్ లక్ష్మీనారాయణ, శివాజీ, నిరంజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరిపిన

# ఎల్ షద్దాయి ఫైర్ మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ రెవ.స్వామి దాస్

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ : సెమీ క్రిస్మస్ వేడుకలు అంటే క్రిస్మస్ పండుగకు ముందు పాఠశాలల్లో చర్చిలలో సంస్థలలో ఏసుక్రీస్తు జననాన్ని పురస్కరించుకొని ముందుగా నిర్వహించే సంబరాలు. ఇందులో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, శాంతా వేషధారణలు,కేక్ కటింగ్, క్రీస్తు సందేశం, వంటివి ఉంటాయి. అటువంటి సెమీ క్రిస్మస్ వేడుకలను తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్ నాట్కో స్కూల్ సమీపంలోని ఎలషాద్దాయి బైబిల్ కాలేజీ ఇండియా, లో సెమీ క్రిస్మస్ వేడుకలను వివిధ చర్చిల పాస్టర్ల మధ్య, దైవజనుల మధ్య శనివారం ఘనంగా జరిపారు ఎల్ షద్దాయి ఫైర్ మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ రెవ స్వామి దాస్. ఈ వేడుకలలో చర్చ్ విశ్వాసులు అనేక కార్యక్రమములు నిర్వహించారు, భక్తిగీతాలు ఆలపించారు, క్రీస్తు పుట్టుక నాటికలు అక్కడికి వచ్చిన అందరి మధ్య ప్రదర్శించారు. పాస్టర్ రెవ.శాంసన్ క్రిస్మస్ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో రెవ.రవికుమార్, పాస్టర్ శామ్యూల్ , సిస్టర్ షర్మిల జాదవ్ , పాల్గొన్నారు. ప్రత్యేక కేకును కట్ చేసి అక్కడికి వచ్చిన అందరికీ ముందుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు స్వామి దాస్. వచ్చిన ముఖ్య అతిథులు అందరికీ శాలువాతో ఘనంగా సన్మానించారు కమిటీ నిర్వాహకులు దైవజనులు ఆలపించిన ఏసుప్రభు భక్తి గీతాలుతో ఆ ప్రాంగణమంతా భక్తిమయం అయింది.



## జాగృత్ హైదరాబాద్- సురక్షిత హైదరాబాద్ అవగాహన సదస్సులో పాల్గొన్న సీపీ సజ్జనార్

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :




సైబర్ నేరగాళ్ల మాయలో పడవద్దని, సాంకేతికత ఎంత పెరుగుతుందో మోసాలు అంత కొత్త పుంతలు తొక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ కమిషనర్ అఫ్ పోలీస్ వీసీ సజ్జనార్. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని మధురానగర్ లోని సాగిరామరాజు కమిటీ హాల్ లో జరిగిన జాగృత్ హైదరాబాద్- సురక్షిత్ హైదరాబాద్ అవగాహన సదస్సులో సజ్జనార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో అదనపు సిపి (క్రైమ్) శ్రీనివాసులు,ఐపిఎస్, తో పాటు సైబర్ క్రైమ్ డిసిపి ఎ.అరవింద్ బాబు, వెస్ట్ జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్, తో పాటు మధురానగర్ పోలీస్ స్టేషన్ సీఐ ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదీప్య రావు పాల్గొని ముఖ్యఅతిథిగా వచ్చిన సజ్జనార్ కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల పట్ల జరిగే మోసాల గురించిన వీడియో క్లిప్పింగ్ అక్కడకు వచ్చిన కాలనీవాసులందరికీ, మీడియా ప్రతినిధులకు ప్రజెంటేషన్ కార్యక్రమం ద్వారా చూపించారు పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులు. అదనపు సిపి శ్రీనివాసులు మాట్లాడుతూ సైబర్ నేరాలు గురించిన సమాచారం కోసం ఎవరికీ ఏ విధమైన సైబర్ సమస్య వచ్చిన 1930 కి కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీకి సంబంధించిన ముఖ్య నాయకులు దేవి రెడ్డి నాగార్జున రెడ్డి, పాల్గొన్నారు కాలనీ అధ్యక్షులు మనోహరరావు పాల్గొని ఈ కార్యక్రమానికి వచ్చిన పోలీస్ అధికారులు అందరికీ ఘన స్వాగతం పలికారు.

### సీపీ వీసీ సజ్జనార్‌తో పాల్గొన్న

## కార్యక్రమంలో కోలన్ సత్యనారాయణ

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గం మధురానగర్ లోని సాగరామరాజు కమిటీ హాల్లో శనివారం జరిగిన సైబర్ నేరాల గురించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు హైదరాబాద్ కమిషనర్ అఫ్ పోలీస్ వీసీ సజ్జనార్. ఈ కార్యక్రమంలో వివిధ హొదాల పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మీడియా ప్రతినిధులతో పాటు భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొలన్ సత్యనారాయణ పాల్గొన్నారు. కొలన్ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా వచ్చిన సజ్జనార్ కు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కొలన్ సత్యనారాయణ మాట్లాడుతూ కమిషనర్ అఫ్ పోలీస్ వీసీ సజ్జనర్ పాల్గొన్న కార్యక్రమంలో నేను పాల్గొనడం నాకు గుర్తుండే రోజు అని అన్నారు.

### సిపి సజ్జనార్ పాల్గొన్న సైబర్ నేరాలపై

## అవగాహన సదస్సులో దేవి రెడ్డి నాగార్జున రెడ్డి

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :




వెస్ట్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మధురానగర్‌లో నిర్వహించిన జాగృత్ హైదరాబాద్,సురక్షిత్ హైదరాబాద్, అవగాహన సదస్సులో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సిపి శ్రీనివాసులు ( క్రైమ్ ), సైబర్ క్రైమ్ డిసిపి ఏ.అరవింద్ తో పాటు వెస్ట్ జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్ తో పాటు వివిధ హొదాల అధికారులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాలనీ సభ్యులు దేవి రెడ్డి నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన సజ్జనార్ కు జ్ఞాపికను అందజేశారు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి. ఈ సందర్భంగా దేవి రెడ్డి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ గురించిన అవగాహన సదస్సు మా కాలనీలో నిర్వహించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో తనవంతు పాత్ర పోషించారు మధురానగర్ పోలీస్ స్టేషన్ సీఐ ప్రభాకర్.

# ఫేస్ 1లో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు డబల్ బెడ్ రూమ్ ఫేస్ వన్ లో గ్రేస్ వింగ్స్ ఫెలోషిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమాన్ని పాస్టర్ ఏలియా, పాస్టర్ సునీల్ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో తనవంతు పాత్ర పోషించారు లక్ష్మీ దుర్గ. ప్రభు ఏసు కు సంబంధించిన శాంతి సందేశాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రభు రాక కోసం చిన్నారులు చేసిన నాటిక పలువురిని ఆకట్టుకుంది. వచ్చిన వారందరికీ ప్రేమ విందు ఏర్పాటు చేశారు లక్ష్మీ దుర్గ. ఈ సందర్భంగా కొల్లూరు భరత్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండాలని అన్నారు. అన్ని కులాలకు మన దేశంలో చోటు ఉందని అన్నారు. అందరికీ ముందుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు



### నేతి కార్ సాయినాథ్ దీప ఆధ్వర్యంలో

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

ఏ ఎం న్యూస్, ఓయూ:



లాలాపేట్ ప్రధాన రోడ్డులో నేతి కార్ సాయినాథ్... దీప, కన్నె స్వామి శివ సాయి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని స్వామియే శరణమయ్యప్ప అంటూ భజనలు పాల్గొని స్వామి సేవలో తరించారు. ఈ సందర్భంగా గురు స్వాములు సదా గురుస్వామి, సుధాకర్ గురుస్వామి, సురేష్ సౌజన్యంతో అంగరంగ వైభవంగా పూజ నిర్వహించారు.

### నావికాదళ దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు

## ముఖ్యఅతిథిగా మందముల పరమేశ్వర్ రెడ్డి




ఏ ఎం న్యూస్ ఓయూ :



నావికాదళ దినోత్సవం సందర్భంగా నాచారంలో మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కబడ్డీ, క్యారమ్స్ పోటీలనునిర్వహించారు. ఈపోటీలలో నాచారంలోని పలుపాఠశాలు పాల్గొన్నాయి. రెండు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో గెలిచిన జట్లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. పోటీల్లో గెలిచిన విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాముఖ్యతను ఇవ్వాల న్నారు. ప్రభుత్వం క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని తెలిపారు. పాఠశాలలు కూడా విద్యార్థులు క్రీడల వైపు మగ్గు చూపే విధంగా కృషి చేయాలి అన్నారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అన్నారు. యువత ప్రస్తుతం డ్రగ్స్ కు బానిస అవుతున్నారని దాని నుంచి బయటపడడానికి క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ గేమ్ లకు అలవాటు పడకుండా గ్రౌండ్ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నావికా దినోత్స వం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుకులు, ఎస్ఎస్ఎస్ యువసేన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాచారం స్థానిక నేతలు పాల్గొన్నారు

## శబరిమలకు పయనమైన అయ్యప్ప భక్తులు

ఏ ఎం న్యూస్ ఓయూ:



బిజెపి జిల్లాకార్యదర్శి మల్లికంటి వీరన్న, మల్లికంటి మణికంఠ 41 రోజుల పాటు అయ్యప్ప దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్ష విరమణ కోసం శబరిమల యాత్రకు సిద్ధమయ్యారు. అంతకంటే ముందు శనివారం అయ్యప్ప స్వామి గుడిలో ఇరుముడి కట్టుకొని ప్రత్యేక పూజలు చేశారు కుటుంబ సభ్యులు వారిని సాదరంగా శబరిమల యాత్రకు సాగనంపారు. వారితో పాటు రజక సెల్ కన్వీనర్ కొన్ని సంపత్, మణికంఠ, చరణ్ రాజ్, సాయి, రాజేష్, ఫణి, మల్లికంటి మహేష్, కేదార్ అశోక్, ప్రేమ్ ధీరజ్, ప్రణీత్ సాయి, నితిన్ కార్తీక్, టిఫిన్ సెంటర్ సాయి, వరలక్ష్మి, రమాదేవి, సుష్మా రెడ్డి, స్వప్న తదితరులున్నారు.

